సాక్షి నిజామాబాద్

ఆదివారం । 7 । జూలై । 2024



ఉద్యోగాలు ఇప్పిస్తానని..

ముస్సిపల్ కార్యాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఓ అంగన్‌వాడీ టీచర్ మోసం చేసిందని బాధితులు నిరసన తెలిపారు.

- 8లో ▸



ధరణి సమస్యల పరిష్కారానికి..

ధరణి సమస్యలు పరిష్కరించడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు.

- 9లో ▸



వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. ఈదురు గాలులు వీస్తాయి. జిల్లాలోని పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

డీఎస్ మృతిపై సోనియాగాంధీ సంతాపం



ఖలీల్‌వాడి: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డి శ్రీనివాస్ మృతిపై కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ సంతాపం తెలిపారు. మాజీ మేయర్ ధర్మపురి సంజయ్‌కు ఆమె సంతాప లేఖ పంపించారు. డీఎస్ మృతితో పార్టీ మంచి నేతను కోల్పోయిందని లేఖలో పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సదరం క్యాంపులు ఖరారు

డొంకేశ్వర్(ఆర్మూర్): దివ్యాంగులకు వికలాంగత్వ నిర్ధారణ కోసం ఈ నెల 10, 24, 31వ తేదీల్లో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉదయం 10 గంటలకు క్యాంపులు ప్రారంభమవుతాయన్నారు. మీసేవా కేంద్రాల్లో బుక్ చేసుకున్న స్లాట్ తేదీ ప్రకారం క్యాంపునకు హాజరు కావాలని, వచ్చేటప్పుడు మెడికల్ సంబంధిత రిపోర్టులు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దు



నందిపేట్ (ఆర్మూర్): ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని వెల్మల్ పాఠశాలతోపాటు నందిపేట కేజీబీవీని శనివారం ఆయన సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి మార్కులు సాధించాలన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బోర్గాం(పి) బడిపై ఎస్‌సీఈఆర్‌టీ సంచికలో కథనం

మోపాల్: నగర శివారులోని 5వ డివిజన్ బోర్గాం(పి) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలపై విద్యాశాఖలోని ఎస్‌సీఈఆర్‌టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) సంచిక (హర్బింగర్స్ ఆఫ్ చేంజ్)లో కథనం ప్రచురితమైంది. ఈ పాఠశాలకు గత ఎనిమిదేళ్లుగా జిల్లాస్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. పాఠశాలలో ప్రతియేటా సగటున వెయ్యికిపైనే విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాది పెరగడం, మౌలిక సదుపాయాలు కల్పన, క్రమశిక్షణ, చదువుకు ప్రాముఖ్యత, కంప్యూటర్ విద్యతోపాటు గతంలో పని చేసి రిటైర్డ్ అయిన ముగ్గురు ప్రధానోపాధ్యాయులు గడ్డం గంగారెడ్డి, పండరి సత్యనారాయణ, నర్ర రామారావుకు వరుసగా రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడం, వంటి పలు అంశాలను సంచికలో 3 పేజీల్లో ప్రస్తావించారు. పాఠశాలపై ఎస్‌సీఈఆర్‌టీ సంచికలో కథనం ప్రచురితం కావడంపై హెచ్‌ఎం శంకర్, విద్యార్థులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

9న తెయూలో జాబ్‌మేళా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 9న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ పాత నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ, తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్ టెక్నాలజీస్ కంపెనీలో టెక్నికల్ రిక్రూటర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, డిజిటల్ మార్కెటింగ్ ఖాళీల భర్తీకి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ మేళాలో అభ్యర్థులకు పీఐఆర్ (వ్యక్తిగత పరిచయ రౌండ్), గ్రూప్ డిస్కషన్, ఎఫ్2ఎఫ్ (ముఖాముఖి) వంటి రౌండ్‌లతో ఇంటర్వ్యూ నిర్వహిస్తారని తెలిపారు. పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఆసక్తి గల విద్యార్థులందరూ ఈ నెల 8లోపు వర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

అసౌకర్యాల వసతి



సిరికొండ ఎస్సీ హాస్టల్‌లో కుంగిపోయిన టైల్స్

- సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు కరువు
- విరిగిన కిటికీలు.. పగిలిన అద్దాలు
- మరుగుదొడ్లు, బాత్‌రూంలకు తలుపులు కరువు
- అధ్వానంగా పరిసరాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో వసతి, క్లాసులు ఒకే గదిలో..



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. హాస్టళ్లలో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కిటికీల అద్దాలు, తలుపులు విరిగిపోయాయి. రెండేళ్లుగా నిధులు లేకపోవడంతో కనీస మరమ్మతులు కరువయ్యాయి. సంక్షేమ హాస్టళ్లలో సమస్యలపై శనివారం 'సాక్షి' విజిట్ చేపట్టింది.

జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలోని బీసీ వసతి గృహంలో పైకప్పు పెచ్చులుడుతున్నాయి. గదులకు తలుపులు సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ వసతి గృహంలో కిటికీలు, తలుపులు విరిగిపోయాయి. నాందేవ్‌వాడ ఎస్టీ హాస్టల్‌లో గదులకు కిటికీలు, తలుపులు లేవు. కంఠేశ్వర్ ఎస్సీ హాస్టల్‌లో కిటికీలు, తలుపులు లేక విద్యార్థినులు వస్త్రాలతో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. వంటగది కూడా అధ్వానంగా ఉంది.

ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలతో పాటు గురుకుల పాఠశాల, కేజీబీవీల్లో సమస్యలు నెలకొన్నాయి. పెర్కిట్ సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో ఆర్వో ప్లాంట్ చెడిపోయింది.

- ఆర్మూర్‌లోని జిరాయత్ నగర్‌లో గల ఎస్సీ వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. వర్షం పడితే స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు సరిపడా స్నానపు గదువు,

ఇరుకు గదులు.. తాగునీటి కష్టాలు

మరుగుదొడ్లు లేవు.

- నందిపేట ఎస్సీ హాస్టల్‌లో పందుల బెడద తీవ్రంగా ఉంది. ప్రహరీ లేదు.
- డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలో బీసీ బాలుర గురుకుల పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. వసతి, భోజనం, తరగతి ఒకే గదిలో నిర్వహిస్తున్నారు.
- మాక్లూర్‌లోని కేజీబీవీకి ప్రహరీ లేదు.



పెర్కిట్ సమీకృత బాలుర వసతి గృహంలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్

నిధులు లేక ఇబ్బందులు

సంక్షేమ వసతి గృహాలకు గత రెండేళ్లుగా నిధులు లేవు. ఎస్సీ సంక్షేమ వసతి గృహాలకు 2022లో రూ.2.30 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. కానీ చేసిన పనులకు రూ.కోటి మాత్రమే నిధులు మంజూరు చేశారు. బీసీ హాస్టళ్లలో రెండేళ్ల కిందట చేపట్టిన పనులకు నేటికి బిల్లులు రాలేదు. మరమ్మతులకు, అత్యవసర పనులకు నిధులు లేకపోవడంతో హాస్టళ్లు సమస్యలకు నిలయంగా మారాయి.

కోతుల బెడద

డిచ్‌పల్లి: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఉన్న హాస్టళ్లు అసౌకర్యాలకు నిలయంగా మారాయి. డిచ్‌పల్లి మండలంలోని కేజీబీవీ ఊరికి దూరంగా ఉండటంతో కోతుల బెడద ఎక్కువగా ఉంది. కోతులు తరగతి గదుల కిటికీల అద్దాలు, తలుపులను ధ్వంసం చేస్తున్నాయి. వర్షం పడితే పాఠశాల ఆవరణలో నీళ్లు నిలుస్తున్నాయి.

- మోపాల్ బీసీ వసతి గృహంలో బెడ్స్ లేకపోవడంతో నేలపైనే నిద్రిస్తున్నారు. మరుగుదొడ్ల తలుపులు శిథిలావస్థకు చేరుకున్నాయి. హాస్టల్‌కు ప్రహరీ లేదు.
- ఇందల్వాయి మండలం సిర్నాపల్లి ఎస్టీ బాలుర వసతి గృహం ఆవరణలో పిచ్చి మొక్కలు పెరిగాయి. డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉంది. హాస్టల్ ఆవరణలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. వార్డెన్ హాస్టల్‌లో ఉండకుండా వేరొకరిని పర్యవేక్షణకు నియమించారు.
- సిరికొండ ఎస్సీ హాస్టల్‌లో ప్రహరీ లేకపోవడంతో కుక్కలు, పందులు ఆవరణలోకి వస్తున్నాయి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి.
- జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లోని బీసీ బాలుర వసతి గృహంలో ఇంకుడు గుంతలో నీళ్లు నిల్వ ఉండి ఆకుపచ్చగా మారాయి.

అస్తవ్యస్తంగా..

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలోని వసతి గృహాల్లో సౌకర్యాలు లేకపోవడంతో వీటి నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. వేల్పూర్‌లోని ఎస్సీ, బీసీ, పడగల్‌లోని బీసీ వసతి గృహాలను మాత్రం అప్పట్లో మంత్రిగా పని చేసిన ప్రశాంత్‌రెడ్డి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. మిగతా వాటిలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి.

- చౌట్‌పల్లిలోని బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో సరిపడ బాత్‌రూంలు, టాయ్‌లెట్స్ లేవు.
- కోనసముందర్ బాలికల హాస్టల్‌లో సౌకర్యాలు లేవు. బాల్కొండలోని ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో వంట గది వద్ద అపరిశుభ్రత దర్శనం ఇస్తుంది.



భీమ్‌గల్ బీసీ హాస్టల్‌లో తలుపు లేని బాత్‌రూం



అపరిశుభ్రంగా ఉన్న బాల్కొండ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వంట గది



నాందేవ్‌వాడ ఎస్టీ వసతి గృహంలో తలుపులు లేని బాత్‌రూమ్‌లు

జిల్లాలోని హాస్టళ్ల వివరాలు

కమ్యూనిటీ	హాస్టళ్లు	విద్యార్థులు
ఎస్సీ	42	31,670
బీసీ	34	34,230
ఎస్టీ	11	1,590

అద్దె భవనాల్లో..

బోధన్: బోధన్ నియోజకవర్గంలో పలు సంక్షేమ వసతి గృహాలు కొన్నేళ్ల నుంచి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. బోధన్ రాకాసీపేట్ ఎస్సీ బాలుర (ఏ) స్పెషల్ హాస్టల్‌ను 2010 నుంచి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనంలో కొనసాగిస్తున్నారు. గదుల్లో స్థలం సరిపోక విద్యార్థులు పాఠశాలలోని తరగతి గదుల్లో నిద్రిస్తున్నారు. పది రోజులుగా బోరులో నుంచి నీరు రాకపోవడంతో మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

- బోధన్‌లోని శక్కర్‌నగర్‌లో గల ఎస్సీ బాలుర (బీ) హాస్టల్ ఆవరణలో నీరు నిలుస్తోంది. పట్టణ కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ పాఠశాల, కళాశాల బాలుర, బాలికల హాస్టల్స్ 11 ఉండగా, ఐదింటికి మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి.
- రెంజల్‌లోని బీసీ బాలికల హాస్టల్‌లో బాత్‌రూం తలుపులకు రంధ్రాలు పడ్డాయి. వాటర్ ప్లాంట్ చెడిపోయింది.
- నవీపేటలో ఎస్సీ బాలుర హాస్టల్‌ను పురాతన భవనంలో నిర్వహిస్తున్నారు. ఐదేళ్ల నుంచి పరుపులు సరఫరా కావడం లేదు.



నవీపేట ఎస్సీ బాలుర హాస్టల్‌లో చిరిగిపోయిన పరుపులు

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, చిత్రంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

నిజామాబాద్ నాగారం/సుభాష్‌నగర్: సీజనల్ వ్యాధుల నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం వైద్య ఆరోగ్యశాఖతోపాటు పంచాయతీ రాజ్, మున్సిపల్, తదితర శాఖల అధికారులతో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. మూడేళ్లలో జిల్లాలో మలేరియా కేసులు నమోదు కాలేదని, పట్టణ ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తున్న డెంగీ నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్యారోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖలు కూడా సమన్వయంతో పని చేస్తూ, సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, నీరు నిల్వ ఉన్న చోట్ల ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు మందులు అందుబాటులో ఉంచాలని, వ్యాధుల పరిస్థితిపై రోజువారీగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. డెంగీ కేసు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. డెంగీ, సీజనల్ వ్యాధుల వివరాలను ప్రైవేటు ఆస్పత్రులు సైతం అందించేలా చూడాలన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అదనపు సంచాలకులు అమర్‌సింగ్, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో తరుణ్ కుమార్ చక్రవర్తి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

నిజామాబాద్ నాగారం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఓపీ విభాగం, లేబర్ వార్డు, క్యాత్‌లాబ్‌లు, టీ హబ్‌ను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా వైద్యారోగ్య శాఖలో ఉద్యోగులు విధులు సరిగ్గా నిర్వహించడం లేదని కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సమీర్ హైమాద్ ఫిర్యాదు చేశారు. ఉద్యోగులే తమ బంధువుల పేర్ల మీద అద్దె వాహనాలు పెట్టి, నిరుద్యోగుల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. కమిషనర్ స్పందించి విచారణ చేయించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



జీజీహెచ్‌ను తనిఖీ చేస్తున్న వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన లక్ష్యాలతో ముందుకు సాగాలి
- హైకోర్టు జడ్జి సుజోయ్ పాల్
- మత్తు పదార్థాల నిర్మూలన సామాజిక బాధ్యత : హైకోర్టు జడ్జి శ్రీసుధ
- న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు జడ్జి సుజోయ్‌పాల్, జడ్జి శ్రీసుధ, జిల్లా జడ్జి సునీత

సుభాష్‌నగర్: భవిష్యత్‌ను అంధకారంగా మారుస్తూ జీవితాన్ని నాశనం చేసే మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సుజోయ్ పాల్ పిలుపు నిచ్చారు. ప్రత్యేకించి ఉజ్వల భవిత కలిగిన విద్యార్థులు మత్తు పదార్థాల వైపు మళ్లకుండా, తమ లక్ష్యం దిశగా అకుంఠిత దీక్షతో ముందుకు సాగాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జస్టిస్ సుజోయ్ పాల్ ముఖ్య అతిథిగా హాజరు కాగా, హైకోర్టు జడ్జి శ్రీసుధ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరీ, జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో హైదరాబాద్ జోనల్ డైరెక్టర్ సచిన్ గోర్పడే, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. జస్టిస్ సుజోయ్ పాల్ మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో విద్యార్థుల ఆత్మహత్యలు ఉండేవి కావని, డ్రగ్స్ అనే పదమే వినిపించేది కాదన్నారు. నేడు అనేకమంది విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడి మానసిక కుంగుబాటుకు లోనవుతూ బలవన్మరణాలకు పాల్పడుతుండటం ఆందోళన కలిగించే అంశంగా మారిందన్నారు. అధునాతన సాంకేతికత, సమాచార విప్లవంతో విజ్ఞాన పరమైన అనేక అంశాలను తెలుసుకునే వెసులుబాటు ఏర్పడిందని, అదే సమయంలో యువత, విద్యార్థులు పెడదోవ పట్టేందుకు కూడా ఇవి కారణభూతంగా నిలుస్తున్నాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థి దశ నుంచే క్రీడలు, వ్యాయామాలు వంటివి చేస్తే గెలుపోటములను సమానంగా స్వీకరించే మానసిక స్థైర్యం అలవడుతుందన్నారు.

హైకోర్టు జడ్జి పి శ్రీసుధ మాట్లాడుతూ బాధ్యతల భారం తెలియని నేటి తరం పిల్లలు, చిన్న కారణాలకే మానసిక సమతుల్యాన్ని కోల్పోతున్నారని, అలాంటి వారు ఎంతో సులభంగా డ్రగ్స్ వైపు మొగ్గుచూపుతూ వాటికి బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతిఒక్కరు మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, తమను తాము పరిరక్షించుకోవాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్‌కు అలవాటు పడినట్లు గమనిస్తే, వెంటనే వారి తల్లిదండ్రులకు ఈ విషయాన్ని తెలియజేయాలని, దీన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు.

జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటికి దూరంగా ఉండేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, డ్రగ్స్ వినియోగం, వాటిని కలిగి ఉండటం వల్ల ఎదుర్కోవాల్సి వచ్చే శిక్షలు తదితర అంశాల గురించి నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో హైదరాబాద్ జోనల్ డైరెక్టర్ సచిన్ గోర్పడే పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అంతకుముందు హైకోర్టు జడ్జీలు జస్టిస్ సుజోయ్ పాల్, శ్రీసుధను నగరంలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అతిథులు ట్రాన్స్‌జెండర్లు, బాధితులకు చెక్కులు అందజేశారు. సదస్సులో న్యాయాధికారులు, వివిధ పాఠశాల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్

- ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో 31 మండలాల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం అందుబాటులోకి రానుంది. నాలుగు నెలల క్రితం కేవలం ముప్కాల్, ఆర్మూర్, ఎడపల్లి, మెంట్రాజ్‌పల్లి రైతు వేదికల్లోనే ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని కల్పించింది. మిగతా రైతు వేదికలకు కూడా విస్తరింపజేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేయడానికి అవసరమైన పరికరాలు జిల్లాకు చేరుకున్నాయి. టీఎస్‌టీఎస్ ప్రతినిధులు ఆయా మండలాలకు వెళ్లి సంబంధిత రైతు వేదికల్లో ఇన్‌స్టాలేషన్ పనులు చేస్తున్నారు. ఎల్‌ఈడీ టీవీ, కంప్యూటర్, స్పీకర్లు, ఇతర సామగ్రి, ఇంటర్నెట్ కనెక్షన్ బిగిస్తున్నారు. వెంటనే ట్రయల్ రన్ నిర్వహించి ఏఈవోల సమక్షంలో వాటి పనితీరును కూడా పరిశీలిస్తున్నారు. జిల్లాలో 33 మండలాలకు గాను 31 మండలాల్లో ఒక రైతు వేదిక చొప్పున వీడియో కాన్ఫరెన్స్‌కు సిద్ధం అవుతున్నాయని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. అయితే ప్రతి మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రితో పాటు రాష్ట్ర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సాగుపై సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ప్రతి మండల కేంద్రంలో సౌకర్యం అందుబాటులోకి రావడంతో రైతులకు ప్రయాణ బాధలు తప్పనున్నాయి.



డొంకేశ్వర్‌లో రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు

క్లుప్తంగా

అభివృద్ధికి నిధులు కేటాయించండి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిని కోరిన ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



ఆర్మూర్: కేంద్రం నుంచి రాష్ట్రానికి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి కలిసి కోరారు. హైదరాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనను శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి, రాజకీయ అంశాలపై చర్చించారు.

కొనసాగుతున్న పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న ఎంఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటాచంద్రశేఖర్ తెలిపారు. వర్సిటీ పరిధిలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ పరీక్ష కేంద్రంలో ఈ పరీక్షలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 35 మందికి 29మంది హాజరు కాగా 6గురు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

డాక్టరేట్ సాధించిన వెంకటేశ్వర్లు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగంలో పరిశోధక విద్యార్థి ఎం వెంకటేశ్వర్లు పీహెచ్‌డీ డాక్టరేట్‌ను శనివారం సాధించారు. వర్సిటీ మాజీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ పి కనకయ్య పర్యవేక్షణలో 'తెలుగు సాహిత్యం విమర్శ – కోవెల సుప్రసన్న గారి కృషి' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. అనంతరం వెంకటేశ్వర్లును అధ్యాపకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెయూ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ లావణ్య, కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ, అధ్యాపకులు లక్ష్మణ చక్రవర్తి, రమణాచారి, ఎండీజమీల్, అబ్దుల్ ఖవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 4 నుంచి టీటీసీ పరీక్ష

నిజామాబాద్‌అర్బన్: టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ పరీక్షను ఆగస్టు 4న నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకొని ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 4న ఉదయం, మధ్యాహ్నం పరీక్ష ఉంటుందన్నారు.

మధ్యాహ్న భోజనంలో పురుగులు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని శంకర్‌భవన్ పాఠశాలలో వండిన మధ్యాహ్న భోజనంలో పురుగులు వచ్చినట్లు విద్యార్థులు హెచ్‌ఎం వాసుదేవరావుకు శనివారం ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా ఇలాగే కొనసాగుతోందని, భోజన నిర్వాహకులకు చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం మధ్యాహ్న భోజన ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జూనోటిక్ వ్యాధులతో జాగ్రత్త

- పరిశుభ్రతతో వ్యాధులు దూరం
- రేబిస్ నివారణ టీకా కార్యక్రమాల్లో వైద్యాధికారులు
- 236 పెంపుడు కుక్కలకు టీకాలు



కుక్కకు టీకా ఇస్తున్న జిల్లా పశుసంవర్ధక అధికారి జగన్నాథచారి

నిజామాబాద్‌నాగారం: కుక్కలు, ఇతర జంతువులు, కోళ్లు, పక్షుల నుంచి సంక్రమించే జూనోటిక్ వ్యాధుల విషయంలో పశు పోషకులు, జంతు ప్రేమికులు జాగ్రత్తగా ఉండాలని పలువురు వైద్యాధికారులు సూచించారు. రేబిస్ నివారణ టీకా కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో పెంపుడు కుక్కలకు వైద్యాధికారులు శనివారం టీకాలు ఇచ్చారు. జిల్లాలో 236 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లా పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నగరంలోని కోటగల్లీ, శివాజీనగర్‌లో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చారు. ఈ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. జిల్లా అధికారి డాక్టర్ వి జగన్నాథచారి, సహాయ సంచాలకుడు డాక్టర్ ఎండీ బాలీగ్ అహ్మద్, డాక్టర్ ఎంకే కైసర్ అహ్మద్, డాక్టర్ బసవ రెడ్డి, డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే తదితరులు కార్యక్రమాల్లో పాల్గొని కుక్కలకు టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను నివారించేందుకు కొన్నేళ్లుగా టీకాలతో బ్రిటిషన్ దేశ శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేశారని పేర్కొన్నారు. 1885 జూలై6న లూయిస్ ప్యాచర్ అనే శాస్త్రవేత్త మొదటిసారిగా పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి వ్యాధి నిరోధక టీకా ఇచ్చారని, ఆ ప్రయత్నం విజయవంతం కావడంతో జూలై6వ తేదీని ప్రపంచ జూనోసిస్ దినోత్సవంగా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. పెంపుడు కుక్కలకు సకాలంలో రేబిస్ నివారణ టీకాలు వేయిస్తే యజమానులు, కుటుంబ సభ్యులతో పాటు సమీప నివాసాల వారు రేబిస్ వ్యాధి నుంచి రక్షించిన వారవుతారని అన్నారు. ఇంట్లో పెంచే పెంపుడు కుక్కలకు మొదటి సారి 30వ రోజు, బూస్టర్ డోస్ 90 రోజులకు, దీంతో ప్రతి ఏటా రేబిస్ నివారణ టీకాలు వేయించాలని వైద్యాధికారులు పేర్కొన్నారు.



రేబిస్ టీకాలు వేస్తున్న డాక్టర్లు





వైద్యశాలలో శునకాలు

అధికారుల చర్యలు శూన్యం

జిల్లాలో ప్రతి ఏడాది కుక్కల కాటుకు గురయ్యే బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. కానీ ఆ దిశగా జిల్లా పశువైద్య, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. 2023లో 4416 మంది కుక్క కాటుకు గురైనట్లు వైద్యాశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది జూన్ నాటికి సైతం 2080మంది కుక్కకాటుకు గురయ్యారు. కానీ వీరిలో ఎంత మంది మాత్రం మృతి చెందారో లెక్కల్లో చూపడం లేదు. జిల్లాలో ప్రతి రోజు ఏదో మూల కుక్క కాటుకు గురైన బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. కానీ వాటి నివారణ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న అపవాదు నెలకొంటోంది. ఇటీవల మాక్లూర్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన బాలుడు, నందిపేట్ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కుక్కకాటుతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇలా కుక్క కాటుతో మరణించే వారి సంఖ్య అధికారుల వద్ద లేకపోవడం విడ్డూరంగా ఉంది.

న్యాయాధికారుల పదవులను భర్తీ చేయాలి



హైకోర్టు న్యాయమూర్తికి వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

ఖలీల్‌వాడి: జిల్లా కోర్టు ప్రాంగణంలో ఖాళీగా ఉన్న న్యాయాధికారుల పదవులను భర్తీ చేయాలని పలువురు జిల్లా న్యాయవాదులు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి శ్రీసుధకు శనివారం వినతిపత్రం అందజేశారు. అధికారిక పర్యటన నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో బస చేసిన ఆమెకు, రాష్ట్ర న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవా సంస్థ చైర్మన్ జస్టిస్ సుజోయ్‌పాల్‌లను నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, సహచర బార్ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్, కార్యదర్శి సురేశ్, కోశాధికారి దీపక్, పలువురు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బార్ తరఫున పలు సమస్యలను పరిష్కారించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. కోర్టుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ప్రతినిత్యం వందలాది మంది కక్షిదారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మూలంగా వచ్చే వాహనాలు, ప్రస్తుత జిల్లాకోర్టు ఆవరణ సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు జగన్ పేర్కొన్నారు. కోర్టు అవసరాలరీత్యా ఓల్డ్ విద్యాశాఖ కార్యాలయ స్థలాన్ని న్యాయశాఖకు కేటాయించేలా కృషి చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని పరిశీలించిన జస్టిస్ శ్రీసుధ సానుకూలంగా స్పందించారు. తాను జిల్లా అదనపు జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించానని, కోర్టులో ఉన్న సమస్యలు తెలుసని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతా కుంచాల, రాష్ట్ర న్యాయసేవా సంస్థసభ్య కార్యదర్శి పంచాక్షరి, న్యాయమూర్తులు, న్యాయవాదులు గోవర్ధన్, పడిగెల వెంకటేశ్వర్, మానిక్‌రాజ్, కవితరెడ్డి, నారాయణ ఉన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

చిన్నారులకు పాఠాలు చెప్పే ఓ టీచర్‌కు అక్రమంగా సంపాదించాలనే దుర్బుద్ధి కలిగింది. దీంతో నిరుద్యోగులను ఆసరా చేసుకొని ఉద్యోగాలు, రుణాలు ఇప్పిస్తానంటూ నమ్మించి రూ. లక్షల్లో వసూలు చేసింది. ఆమె మాటలు నమ్మిన పలువురు బాధితులు డబ్బులు అప్పగించారు. తీరా ఏడు నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు, రుణాలు ఇప్పించక పోవడంతో ఆమె చేసిన మోసాన్ని గుర్తించిన బాధితులు లబోదిబో మంటున్నారు.





వినతిపత్రం అందిస్తున్న బాధితులు, మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

- రూ. 6లక్షలు వసూలు చేసిన అంగన్‌వాడీ టీచర్
- ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవోకు బాధితుల ఫిర్యాదు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని చంద్రశేఖర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న టీచర్ మేరీ తమను మోసం చేసిందంటు పలువురు బాధితులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఐసీడీఎస్ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్, మాక్లూర్ మండలాల్లోని చుట్టు పక్కల గ్రామాల్లోని నిరుద్యోగులు, మహిళలకు అంగన్‌వాడీ టీచర్ మేరీ ఉద్యోగాలు, రుణాలు ఇప్పిస్తానంటూ నమ్మించి డబ్బులు వసూలు చేసింది. గతేడాది నవంబర్‌లో మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ. 30వేల చొప్పున 20మంది నుంచి సుమారు రూ. 6లక్షలు వసూలు చేసింది. అంతేకాకుండా రుణాలు ఇప్పిస్తానని తన కు రూ. 3వేలు ఇస్తే రూ. 3లక్షలు చొప్పున ఇప్పిస్తానంటు నమ్మించి సుమారు 50మంది నుంచి రూ. 1లక్షా50వేలు వసూలు చేసింది. ఈ నగదును ఆమెకు ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా బాధితులు చెల్లించారు. గత ఏడు నెలలుగా ఉద్యోగాలు, రుణాల విషయమై ఆమె చుట్టూ ఏడు నెలలుగా తిరుగుతున్నా తప్పించుకు తిరుగుతోంది. దీంతో తాము మోసపోయానట్లు బాధితులు గుర్తించి జిల్లా అధికారులకు ఈ విషయమై విన్నవించారు. ఇన్‌చార్జి సీడీపీవో నందినికి ఫోన్‌లో సమస్యను విన్నవించారు. కలెక్టర్‌కు ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేస్తామని సుమలత, ప్రశాంతి, లక్ష్మి, సవిత తదితరులు పేర్కొన్నారు.

న్యాయం చేయాలి



ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి మోసం చేసింది. 20మందికి పైగా రూ. 30 వేలు వసూలు చేసింది. అంగన్‌వాడీ టీచర్ మేరీపై అధికారులు చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలి.

– సుమలత, బాధితురాలు

టీచర్‌పై చర్యలు తీసుకోవాలి



మాలాంటి ఎంతోమంది అమయాకులను మోసం చేసిన అంగన్‌వాటీ టీచర్ మేరీపై చర్యలు తీసుకోవాలి. మా డబ్బులు మాకు తిరిగి ఇప్పించాలి. అధికారులు శాఖపరమైన చర్యలు తీసుకొవాలి.

– ప్రశాంతి, బాధితురాలు

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు

- తల్లీబిడ్డలను కాపాడిన ఫైర్ సిబ్బంది





ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లో ఉన్న వనమాల కృష్ణ ఇంట్లో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు వ్యాపించాయి. ఈ మంటల్లో తల్లీబిడ్డలు చిక్కుకున్నారు. స్థానికులు ఫైర్‌శాఖకు సమాచారం అందించారు. తాము ఘట న స్థలానికి చేరుకొని మంటల్లో చిక్కుకున్న తల్లి పావని, కుమారులు అవన్, ఆర్విలను కాపాడినట్లు ఫైర్ ఆఫీసర్ నర్సింగ్ రావు తెలిపారు. తాము రావడం ఆలస్యమైతే తల్లి, బిడ్డలు సజీవదహనం అయ్యేవారని పేర్కొన్నారు. సకాలంలో మంటలను ఆర్పి తల్లి, బిడ్డలను కాపాడిన ఫైర్ సిబ్బందిని స్థానికులు అభినందించారు. ఫైర్ సిబ్బంది ప్రశాంత్, తిరుపతి, సురేశ్ ఉన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

గాంధారి: భూమి కోసం తనను కులం పేరుతో ఓ వ్యక్తి దూషించి దాడి చేశాడని ఆరోపిస్తూ మాతు సంగెం గ్రామానికి చెందిన సంగవ్వ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. అదే గ్రామానికి చెందిన రాజేందర్ గ్రామ శివారులోని అసైన్డ్‌మెంట్ భూమిని సాగుచేస్తుంటే అభ్యంతరం తెలుపుతూ కులం పేరుతో దూషించాడన్నారు. ఈ విషయమై ఫిర్యాదు చేయడంతో భూమి విషయం కావడంతో తహసీల్దార్‌కు సమాచారం అందించామన్నారు. ఈ విషయమై తహసీల్దార్ సతీశ్‌రెడ్డిని వివరణ కోరగా సర్వే చేయించి విచారణ చేపడతామని పేర్కొన్నారు.

చిరుత సంచారంపై విచారణ

నవీపేట: మండలంలోని కమలాపూర్ శివారులో శుక్రవారం మేకల మందపై చిరుత దాడి చేసిన ఘటనపై నిజామాబాద్ రేంజ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు సుధీర్ కుమార్, విజయ భారతి శనివారం విచారణ చేపట్టారు. చిరుత సంచారంపై వేలి ముద్రలు పరిశీలించారు. ఎక్కడా సంచార ఆనవాళ్లు లేవని పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాంతంలో చిరుత సంచరించి ఉండడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుంపులు గుంపులుగా ప్రయాణించాలని పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్లు సీజ్



బాన్సువాడ: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేసినట్లు సీఐ కృష్ణ శనివారం పేర్కొన్నారు. బిచ్కుంద మండలం కతిగాం క్వారీ నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లను తాడ్కోల్ శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. టిప్పర్ల యజమాని షేక్ షాకీర్, డ్రైవర్లు సమీర్, అఫ్రోజ్, సయ్యద్ అమేర్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే బీర్కూర్ మంజీర ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా తరలిస్తున్న రెండు ఇసుకను టిప్పర్లను తహసీల్దార్ లత పట్టుకున్నారు. టిప్పర్లకు రూ.20 వేల జరిమాన విధించినట్లు ఆమె పేర్కొన్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన కుమార్తె



తల్లి కర్మకాండ నిర్వహిస్తున్న మమత

కామారెడ్డి అర్బన్: అనారోగ్యంతో మృతి చెందిన తల్లికి కుమార్తె తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. కామారెడ్డి పట్టణం దేవునిపల్లికి చెందిన పూలపల్లి విజయలక్ష్మి(65)కి ఇద్దరు కుమార్తెలు. వీరికి పెళ్లిలు చేసి అత్తారింటికి పంపింది. కొన్నేళ్ల క్రితం భర్త మృతి చెందడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. చిన్న కుమార్తె మమత భర్త ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లడంతో వృద్ధాప్యంలో బాధపడుతున్న తల్లికి సపర్యలు చేస్తూ తల్లి వద్దే ఉంటోంది. శనివారం ఉదయం విజయలక్ష్మి ఆరోగ్యం క్షీణించి మృతి చెందింది. కుమారులు లేనందున తలకొరివి ఎవరు పెడతారన్న ప్రస్తావన రాగా తాను చేస్తానని ముందుకు వచ్చింది. తల్లికి కుమార్తె తలకొరివి పెట్టడం చూసి అక్కడున్న వారు కన్నీటి పర్యంతమయ్యారు.

మహిళను ఢీకొన్న కారు

- పరిస్థితి విషమం
- డ్రైవర్‌ను చితకబాదిన గ్రామస్తులు
- ఆస్పత్రికి తరలింపు



తీవ్రగాయాలై పడిపోయిన కళావతి



కారు డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

మాక్లూర్: పొలంలో నారు వేసేందుకు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉంది. ఘటనకు సంబంధించి ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ముల్లంగి(బి) గ్రామానికి చెందిన కళావతి గ్రామ శివారులో పొలంలో నారు వేసేందుకు శనివారం ఉదయం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తోంది. అదే సమయంలో జిల్లా కేంద్రానికి చెందిన జిలుకర ప్రసాద్ బొంకన్‌పల్లి నుంచి నిజామాబాద్‌కు మితిమీరిన వేగంతో వెళ్తుండగా ఆమెను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆమెపై నుంచి కారు వెళ్లడంతో పరిస్థితి విషమంగా మారింది. కళావతిని ఢీకొన్న కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు, రైతులు పెద్ద ఎత్తున కేకలు వేస్తూ డ్రైవర్‌ను కిందికి దిగాలని వారించారు. కారులో ఉన్న ప్రసాద్ కారు ఆపకుండా గ్రామస్తుల పైకి వేగంగా నడిపేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆగ్రహానికి గురైన గ్రామస్తులు డ్రైవర్‌ను బయటకు తీసి చితకబాదారు. అపస్మారక స్థితికి వెళ్లడంతో ఆస్పత్రికి తరలించారు. కళావతి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, బిజినెస్, పర్సనల్, ఎడ్యుకేషన్, ప్రాపర్టీ పైన అమౌంట్ ఇవ్వబడును. ఏజెంట్స్ & DMA కావలెను. జీతం + కమిషన్. ఫోన్: 8295642391/7015882322. [H-189684]

CHANGE OF NAME

■ I, ANJUTAI BANDARI W/O. BHANDARI VIJAY KUMAR R/o. Flat No. 201 Vaishnavi Residency Housing Board Colony, Armoor (M), Nzb (D). Have Changed my Name as BANDARI ANJALI W/o. BHANDARI VIJAY KUMAR [Z-1080790]

PASSPORT MISSING

■ BOBBILI RAJU S/o. BOBBILI SAYANNA తొర్లికొండ ఇ.నెం. 2-109 జక్రాన్‌పల్లి నుండి తొర్లికొండకు బైక్‌పై వెళ్తుండగా V1790016 పాస్‌పోర్ట్ పోయినది. దొరికినయెడల సంప్ర: 8790919094. [Z-1080789]

REAL ESTATE

PLOTS WANTED

■ బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (BBG), Building Blocks Group షాద్‌నగర్, హైదరాబాద్ అన్ని వెంచర్ రీసేల్ ప్లాట్లను కొనబడును. ఫోన్ : 7671886273. [HA-1375]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217. [M-1185240]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పని చేయుటకు లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901. [HA-13695]

■ MSR Developers కొరకు తెలంగాణ / ఆంధ్రాల్లో మార్కెటింగ్ సిబ్బంది కావలెను & మీరు ఉన్న ఏరియాల్లోనే లేఅవుట్ వెంచర్ ఫాం ల్యాండ్ పార్ట్‌నర్స్ కావలెను. ఫోన్: 8499940666. [H-189680]

■ రిటైర్డ్ Govt ఇంజనీర్ – హైదరాబాదుకు ఏ బాదరాబందీ లేని (BC,OC) ఇంట్లో ఉంటూ వంట, ఇంటి పని చేయుటకు మహిళ కావలెను. డైరెక్ట్‌గా సంప్రదించండి. ఫోన్: 8179713792. [HA-350]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-800428]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి తగిన విధంగా ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

ఖలీల్‌వాడి: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో అర్సపల్లికి చెందిన ఒకరు మృతి చెందినట్లు ఆరో టౌన్ ఎస్సై మొగులయ్య శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అర్సపల్లికి చెందిన ప్రవీణ్(45) కిరాణ షాప్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి కిరాణ సామాగ్రిని రోడ్డుపై నడుచుకుంటు తీసుకెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో మురికి కాలువలో పడ్డ ప్రవీణ్ మృతి చెందాడు. ఆ రోడ్డు గుండా చీకటి ఉండడంతో ఎవరూ గమనించలేదు. కొద్ది సేపటికి స్థానికులు మురికి కాలువలో మృతదేహం ఉందని తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

బోధన్‌రూరల్: ప్రమాదవశాత్తు వేడినీరు పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై నాగనాథ్ శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సాలూర మండల కేంద్రానికి చెందిన నీలకంఠం లక్ష్మీబాయి(75)కి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సాలూరలో ఉంటున్న కుమారుడి ఇంటికి మరమ్మతులు చేపడుతుండడంతో నాలుగు నెలల క్రితం హున్సలో ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లింది. అక్కడ గత నెల 28న స్నానం కోసం బాత్‌రూంకు వెళ్తుండగా అక్కడే ఉన్న వేడినీరు ఆమెపై పడింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గోపన్‌పల్లి చౌరస్తాలో బైక్‌పై తరలిస్తున్న రెండు కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గోపన్‌పల్లి చౌరస్తాలో శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీ చేపడుతున్న సమయంలో పోచారం తండాకు చెందిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వెళ్తుండగా వారి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. ముగ్గురిలో ఒకరిని అదుపులోకి తీసుకోగా ఇద్దరు పరారైనట్లు చెప్పారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించగా మరో ఇద్దరిని త్వరలో పట్టుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

మూడు మడిగెలు..



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయానికి చెందిన మూడు మడిగెలను ఆలయ ఈవో రవీందర్ శనివారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. మడిగెల కిరాయి గత 25 నెలల నుంచి చెల్లించకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మడిగెలు తీసుకున్నవారు సకాలంలో కిరాయి చెల్లించాలని సూచించారు. ఆయన వెంట ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఒకరి అదృశ్యం

రెంజల్: మండలంలోని కందకుర్తికి చెందిన ఫెరోజ్‌ఖాన్ అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న శనివారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. సెంట్రింగ్ పనులు చేసే అతను గత నెల 16న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. భార్య ఫర్జానా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆధార్ కేంద్రంలో చోరీ

ఇందల్వాయి: తిర్మన్‌పల్లి జీపీ కార్యాలయ భవనంలో నిర్వహిస్తున్న శాశ్వత ఆధార్ నమోదు కేంద్రంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై మనోజ్ శనివారం తెలిపారు. పంచాయతీ మొదటి అంతస్తులో ఉన్న ఆధార్ కేంద్రం గది తాళం పగలగొట్టి అందులో ఉన్న ల్యాప్‌టాప్‌ని దుండగులు ఎత్తుకెళ్లారు. నిర్వాహకుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: అనారోగ్యం, కుటుంబ సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెందిన ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లింగ చంద్రం(53) గ్రామంలో కిరాణం దుకాణం నడిపిస్తున్నాడు. కొద్ది రోజులుగా వెన్నుపూస సంబంధిత సమస్యతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాడు. ఆన్‌లైన్ గేమ్‌ల కారణంగా అప్పుల పాలైన అతడి కుమారుడు రెండు రోజుల క్రితం ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. శనివారం ఉదయం చంద్రం భార్య అరుణ, కోడలు కలిసి కామారెడ్డికి వచ్చారు. మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చేసరికి చంద్రం తన ఇంట్లోని వెనుక గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని దేవునిపల్లి పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ..

బిచ్కుంద(జుక్కల్): భార్య కాపురానికి రావడం లేదని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కుమ్మరి సాయిలు(30)కు భార్య మధ్య కొన్ని నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆమె తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన సాయిలు గ్రామ శివారులోని గిద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఆశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రైవేట్ లైన్‌మన్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న సాయిలు

ఆర్మూర్‌టౌన్: మండలంలో గోవింద్‌పేట్‌లో శనివారం చోటు చేసుకున్న విద్యుత్ ప్రమాదంలో ప్రైవేట్ లైన్‌మన్ కొత్తూర్ సాయిలుకు గాయాలయ్యాయి. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేపడుతుండగా సమీపంలోని 11కేవీ విద్యుత్ తీగల నుంచి విద్యుత్ సరఫరా కావడంతో సాయిలు విద్యుదాఘాతం సంభవించి ఎడమకాలికి గాయాలయ్యాయి. గమనించి స్థానికులు ఆర్మూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం జిల్లాలోని ఆస్పత్రికి తరలించారు. కాగా సాయిలు చికిత్స కోసం అయ్యే ఖర్చును స్థానిక ట్రాన్స్‌కో లైన్‌మన్ భరించనున్నట్లు తెలిసింది.